ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 16.10.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో విపత్తును , 251 టీఎంసీల నీటి కొరతను అందరం కలిసి సమైక్యంగా ఎదుర్కొందామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

2. ప్రస్తుత పరిస్థితులు కాలం తెచ్చిన కరువు కాదని , కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన కరువేనని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.

3. బంగ్లాదేశ్ తరహా హింసాత్మక పరిణామాలతో భారతదేశంలో పాలన మార్పు తెస్తామంటూ వ్యాఖ్యానించడం తీవ్ర దేశద్రోహపూరితమని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు.

4. రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు , దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

**రేవంత్‌రెడ్డి**

ఎల్‌నినో విపత్తును అందరం కలిసి సమైక్యంగా ఎదుర్కొందామని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జలాశయాల్లో 460 టీఎంసీలకు గాను కేవలం 209 టీఎంసీలే ఉన్నాయని , 251 టీఎంసీల నీటి కొరత ఉందని ఆయన తెలిపారు. నీళ్లను కొనుక్కోలేం కాబట్టి ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. తాగునీటికే మొదటి ప్రాధాన్యమివ్వాలని, యాసంగిలో రైతులు వరి సాగును తగ్గించుకోవాలని కోరారు. నీటిని వృథా చేయకుండా ప్రతి చుక్కను ఆదా

చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కష్టకాలంలో కేంద్రం 60:40 నిష్పత్తిలో నిధులతో రాష్ట్రానికి పూర్తి సహాయం అందించాలని సీఎం కోరారు.

డెస్క్

**వాయిదా**

పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో ప్రభావం వల్ల తెలంగాణలో నెలకొన్న పరిస్థితులపై ఇవాళ రాష్ట్ర సచివాలయంలో జరగాల్సిన అఖిలపక్ష సమావేశం వాయిదా పడింది. ఈ సమావేశం తిరిగి ఎప్పుడు నిర్వహించనున్నారనే విషయాన్ని ప్రభుత్వం త్వరలోనే ప్రకటించనుంది.

డెస్క్

**కేటీఆర్**

రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితి కాలం తెచ్చిన కరువు కాదని , కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువేనని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. గోదావరి , కృష్ణా జలాలను సరిగ్గా వాడుకోకుండా వృథాగా దిగువకు వదిలేయడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని, ఎల్ నినో హెచ్చరికలను కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆయన సోషల్ మీడియా వేదికగా ఆరోపించారు.

డెస్క్

**కిషన్ రెడ్డి**

హైదరాబాద్, బంజారాహిల్స్ లోని సాగర్ సొసైటీలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక మహిళలతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. పూలను పూజించే ఈ అద్భుత వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, తన తరఫున ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. గౌరమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు చేకూరాలని, ప్రధాని మోదీకి ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

డెస్క్

**బతుకమ్మ వేడకలు**

లోక్ భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు పాల్గొని గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి , ప్రకృతి ఆరాధన, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని గవర్నర్ తెలిపారు. దాదాపు 400 మంది మహిళలు, కళాకారులు ఉత్సాహంగా పాల్గొని జానపద పాటలు, కోలాటాలతో అలరించారు.

డెస్క్

**ప్రత్యేక పూజలు**

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ సరస్వతి దేవి రూపంలో ఉన్న అమ్మవారిని మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనగా , ఈ అంశంపై రాజకీయం చేయకుండా అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని మంత్రి పొన్నం పిలుపునిచ్చారు.

డెస్క్

**కరీంనగర్**

కరీంనగర్ జిల్లా లోని శ్రీ మహాశక్తి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థుల అక్షరాభ్యాసాలు , ప్రత్యేక పూజలతో ఆలయం కోలాహలంగా మారగా , కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తో పాటు మాజీ ఎంపీ గరికపాటి మోహన్ రావు , జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ సహా పలువురు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

బైట్ ... హుస్సేన్ నాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

పిటిసి, కరీంనగర్

**ఆది శ్రీనివాస్**

రాజన్న సిరిసిల్ల జిల్లా , వేములవాడలో సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రభుత్వ విప్ , వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ , మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజుతో కలిసి ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా వేములవాడలో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఉదయం మున్సిపల్ కార్యాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చే శారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ...

బైట్ ... ఆది శ్రీనివాస్

పిటిసి, సిరిసిల్ల

**నల్గొండ – బతుకమ్మ వేడుకలు**

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ పండుగ ఎంతో విశిష్టమైనదని పేర్కొన్న ఆయన, జిల్లా ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనే శక్తిని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

పిటిసి, నల్లగొండ

**సద్దుల బతుకమ్మ**

సద్దుల బతుకమ్మ , దసరా ఉత్సవాలను ప్రశాంతంగా , వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేసి, ఉత్సవ ప్రాంగణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.

పిటిసి, వరంగల్

**ఎస్. రాంచందర్ రావు**

బంగ్లాదేశ్ తరహా హింసాత్మక పరిణామాలతో భారతదేశంలో పాలన మార్పు తెస్తామంటూ కొందరు ఢిల్లీ ప్రెస్ మీట్‌లో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దేశద్రోహపూరితమని బీజేపీ నేత ఎన్. రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి విద్రోహ శక్తుల వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ , రాహుల్ గాంధీ తమ వైఖరిని వెంటనే స్పష్టం చేయాలని , వారి మౌనం వెనుక ఉన్న కుట్రను ప్రజలు గమనిస్తున్నారని ఆరోపించారు.

డెస్క్

**ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

కాంగ్రెస్, బీఆర్ఎస్ హయాంలో లక్షల కోట్ల రూపాయల భూ కుంభకోణాలు జరిగాయని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో సెక్షన్ 22-ఏ పేరిట వేల ఎకరాల ప్రభుత్వ , ప్రైవేట్ భూములను అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చి భారీ దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ భూ కుంభకోణాలపై జ్యుడీషియల్ లేదా సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

డెస్క్

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

విద్యుత్ సమస్యలపై బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. నాసిరకం బొగ్గు సరఫరా వల్లే కరెంట్ కోతలు వచ్చి పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకుండా నిష్టావంతుడైన సీఈని సస్పెండ్ చేయడం సరికాదని , బాధ్యుడైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

డెస్క్

**ఫిట్‌నెస్ పరీక్షలు**

తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను ఆధునిక సాంకేతికతతో నిర్వహించేందుకు రూ. 425.50 కోట్లతో 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం సవరించిన

అనుమతులు మంజూరు చేసింది. రెండు దశల్లో నిర్మించే ఈ స్టేషన్ల నిర్వహణ బాధ్యతలను రవాణా శాఖ పరిధిలోని ప్రత్యేక సంస్థకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

డెస్క్

**వివేక్**

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో పారదర్శకత కోసం ప్రక్షాళన చేపడుతున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. 2018 నుంచి వచ్చిన క్లెయిమ్‌లపై సమగ్ర విజిలెన్స్ విచారణకు ఆదేశించామని, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు.

డెస్క్

**తనిఖీలు**

తెలంగాణ ఆహార భద్రత అధికారుల - TG SAFE బృందం CURE పరిధిలోని 7 కోవా, మిఠాయి తయారీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. అపరిశుభ్ర వాతావరణం , లైసెన్సులు లేకపోవడం వంటి ఉల్లంఘనలపై రూ.3.78 లక్షల విలువైన 2,480 కిలోల ఆహార పదార్థాలను సీజ్ చేశారు.

డెస్క్

**వంట వార్పు**

తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఎదుట నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు మంగళవారం ప్రారంభించిన నిరసన కార్యక్రమం భాగంగా ఈరోజు కలెక్టరేట్ ఎదుట వంట వార్పు నిర్వహించారు.

పిటిసి, ఆసిఫాబాద్

**మార్నింగ్ వాక్**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. మైదానానికి వచ్చే వాకర్స్ తో మాట్లాడి , వారు ఎదుర్కొంటున్న సమస్యలు , కావాల్సిన అవసరాలను తెలుసుకున్నారు.

పిటిసి, యాదాద్రి భువనగిరి

**సబ్యసాచి ఘోష్**

వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ లో పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ తనిఖీలు చేపట్టారు. కిటెక్స్ , యంగ్‌వన్, గణేశా కంపెనీల పనితీరును పరిశీలించిన ఆయన , స్థానికంగా వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించి ఉపాధి , ఆర్థిక పురోగతికి తోడ్పడాలని తెలిపారు.

డెస్క్ / వరంగల్

**ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని కాళేశ్వరం మల్టీ జోన్ డీఐజీ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ నీతిక పంత్, ఏఎస్పీ చిత్తరంజన్ డీఐజీకి స్వాగతం పలికారు.

పిటిసి, ఆసిఫాబాద్

**సూర్యాపేట కలెక్టర్**

రైతులు నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తెచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. కలెక్టరేట్‌లో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పిటిసి, నల్గొండ